
సాక్షి
నంద్యాల
బుధవారం, 28, జూన్, 2023



జీడీపీలో 1.4 టీఎంసీల నీరు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టులో మంగళవారం 1.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తాగునీటి అవసరాల కోసం పత్తికొండ, డోన్, కృష్ణగిరి మండలాలకు నీటి విడుదల కొనసాగుతోంది.



అలరించిన సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిత్యకళావేదికపై అనంతపురానికి చెందిన పి.అనిత వారి భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది.



భయం గుప్పిట్లో బలపాలతిప్ప

సంగమేశ్వరం సమీపంలోని బలపాలతిప్ప గ్రామంలో వరుసగా రెండో రోజు పెద్ద పులి ఆవుల మందపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. - 8లో..

న్యూస్‌రీల్

మల్లన్నను దర్శించుకున్న మంత్రులు



మల్లన్న దర్శనానికి వెళ్తున్న మంత్రులు అంబటి, ఆదిమూలపు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను మంగళవారం ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. రాజగోపురం వద్ద మంత్రులకు దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం మంత్రులకు ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

ఓపెన్ పరీక్షలకు 35 మంది గైర్హాజర్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో మంగళవారం జరిగిన ఇంటర్, పది పబ్లిక్ ఓపెన్ పరీక్షలకు 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో జరిగిన ఇంటర్ పరీక్షకు 295 మంది విద్యార్థులకు గాను 261 మంది (88శాతం) మంది హాజరయ్యారు. 34 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పదో తరగతి పరీక్షకు 8 మంది విద్యార్థులకు గాను ఏడుగురు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

శాకాంబరీ దేవిగా కొలనుభారతి అమ్మవారు



కొత్తపల్లి: కొలనుభారతిదేవి క్షేత్రంలో అమ్మవారు మంగళవారం భక్తులకు శాకంబరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. కూరగాయలు, నిమ్మకాయలు, టెంకాయలు, మామిడిపండ్లు, వేపాకులు, పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆత్మకూరు వాసవీ సత్రం మహిళా మండలి సేవకులు అమ్మవారికి శాకంబరీ దేవి అలంకారం చేసి విశేషపూజలు నిర్వహించారు.

సీపీఆర్‌కు పంచాయతీ కార్యదర్శుల వివరాలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్(సీపీఆర్) ఆదేశాల మేరకు జిల్లాలో ఈఓఆర్‌డీ పదోన్నతులకు అర్హత కలిగిన పంచాయతీ కార్యదర్శుల వివరాలను పంపుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీడీఓ నుంచి గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శులుగా 22 మంది, గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు పదోన్నతి పొందిన వారు 13 మంది, గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులు 7గురు ఉన్నారన్నారు. వీరు ఎప్పుడు ఉద్యోగంలో చేరారు? సర్వీసు క్రమబద్ధీకరణ? కేసులు? కమ్యూనిటీ? తదితర వివరాలను వెంటనే పంపించాల్సి ఉందన్నారు. ఇటీవల జోన్-4 పరిధిలో పలువురు ఈఓఆర్‌డీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించిన నేపథ్యంలో అర్హులైన పంచాయతీ కార్యదర్శులకు ఈఓఆర్‌డీలుగా పదోన్న తి కల్పించేందుకు ఈ వివరాలు అవసరమన్నా రు. పదోన్నతుల్లో భాగంగా ఈ ఏడాది మే 28న ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 13 మంది ఈఓఆర్‌డీలు ఎంపీడీఓలుగా పదోన్నతి పొందారు.

అర్బన్ కార్డులకు కిలో ఫోర్టిఫైడ్ చక్కీ గోధుమ పిండి

కర్నూలు(సెంట్రల్): జూలై మాసం నుంచి కార్పొరేషన్, మునిసిపాలిటీ, నగర పంచాయతీల్లోని అర్బన్ కార్డుదారులకు కేజీ ఫోర్టిఫైడ్ చక్కీ గోధుమ పండి సరఫరా చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేజీ గోధుమ పిండికి రూ.16 చెల్లించాలన్నారు.

తెల్ల బంగారం ధర తగ్గుముఖం

ఆదోని అర్బన్ : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర రోజురోజుకు తగ్గుతూ వస్తోంది. గత వారంలో రూ.7,300 ధర పలకగా, ఈ వారం రూ.6,800గా నమోదైంది. మంగళవారం 943 క్వింటాళ్ల పత్తి రాగా, గరిష్ట ధర రూ.6,800, మధ్య ధర రూ.6,569, కనిష్ట ధర రూ.4,509 పలికింది.

అమ్మ మురిసేలా.. బడి మెరిసేలా!

ప్రతి ఇంటిలో చదువుల దీపం వెలుగులు విరజిమ్మేలా.. నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా.. చదువులమ్మ ఒడి కళకళలాడేలా.. జగనన్న ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేసింది. అమ్మఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద, నాడు -నేడు మనబడి, జగనన్న ఆణిముత్యాలు.. ఇలా ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు అండగా నిలుస్తోంది. పేదలపై చదువుల భారం పడకుండా వరుసగా నాలుగో ఏటా నేడు అమ్మఒడి పథకం నిధులు జమ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆనందం నింపుతోంది. – నంద్యాల



- నేడు 'అమ్మఒడి' నాలుగో విడత నిధులు జమ
- జిల్లాలో 1,67,084 మంది విద్యార్థులకు రూ.217.20 కోట్ల లబ్ధి
- మన్యం జిల్లా కురుపాం నుంచి బటన్ నొక్కి నిధులు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి
- నేరుగా తల్లుల ఖాతాల్లో నగదు జమ
- అర్హులందరికీ అందేలా ప్రభుత్వం చర్యలు

పేదరికంతో ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న అమ్మ ఒడి' పథకం వరుసగా నాలుగో విడత పంపిణీకి రంగం సిద్ధమైంది. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసేందుకు కసరత్తు పూర్తి చేసింది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నుంచి బుధవారం బటన్ నొక్కి సీఎం జగన్ నిధులను విడుదల చేస్తారు. గత ఏడాది నంద్యాల జిల్లాలో 1,72,112 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.258.16 కోట్లు జమ చేశారు. ఈ ఏడాది 1,67,084 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.217.20 కోట్లు నగదు జమ చేయనున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 1 నుంచి 10వ తరగతి, ఇంటర్ వరకు చదువుతున్న పేద విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి నగదు జమ కానున్నాయి. ఇప్పటికే అర్హుల జాబితాలను గ్రామ వార్డు, సచివాలయాల్లో ప్రదర్శించారు. అమ్మ ఒడి నాలుగో విడత కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఏ ఒక్క పేద విద్యార్థి ఆర్థిక భారంతో చదువుకు దూరం కాకూడదనేది సీఎం జగన్ ఆలోచన. గతంలో అనేక మంది పేదలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ పిల్లలను బడికి పంపేవారు కాదు. బడికి పంపిస్తే ఫీజులు, పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్‌బ్యాగ్‌లు, తదితర అవసరాలకు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చేది. దీంతో ప్రజా సంకల్ప యాత్రలో పేదల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసిన జగన్ సీఎం అయిన వెంటనే అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం జగనన్న విద్యాకానుక పేరుతో స్కూల్ బ్యాగ్‌తో సహా అన్ని వస్తువులను ప్రభుత్వమే అందజేస్తోంది. ఈ ఏడాది కూడా పాఠశాల తెరిచిన రోజే జగనన్న విద్యాకానుకను అందజేశారు. అమ్మఒడి పథకం ద్వారా పాఠశాలకు చిన్నారులను పంపించే ప్రతి కుటుంబానికి రూ.13 వేలు ప్రభుత్వం జమ చేస్తోంది. అలాగే ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. వెయ్యి, టాయిలెట్ల నిర్వహణ తదితర అవసరాల కోసం మరో రూ. వెయ్యిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఖాతాల్లో జమ చేసింది. అర్హులందరికీ అమ్మఒడి పథకం వర్తింపజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అర్హత ఉన్న వారు సచివాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తే నిధులు మంజూరు కానున్నాయి.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

అమ్మ ఒడి పథకం లబ్ధిని అందుకునేందుకు ఉద్దేశించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా నిర్వహించింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా వలంటీర్లు క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వం అందించే లబ్ధికి దూరం కాకూడదనే సదుద్దేశంతో ఎంపిక ప్రక్రియను చేపట్టారు. వలంటీర్లు రెండు రోజులుగా తమ పరిధిలోని విద్యార్థుల తల్లుల అథంటిఫికేషన్ నమోదు చేశారు.



వారం రోజుల పాటు అమ్మ ఒడి వారోత్సవాలు

అమ్మ ఒడి వారోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. బుధవారం జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి మండల కేంద్రం, మున్సిపాలిటీల్లో 'అమ్మ ఒడి' కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొనున్నారు.

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల వివరాలు..

నియోజకవర్గం	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)
నంద్యాల	26,580	34.56
ఆళ్లగడ్డ	27,773	36.10
బనగానపల్లె	27,128	35.26
డోన్	28,575	37.14
నందికొట్కూరు	25,560	33.22
పాణ్యం	08,536	11.09
శ్రీశైలం	22,932	29.81
మొత్తం	1,67,084	217.20

ఆర్థిక భారం తగ్గింది



నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో పాఠశాలలు తెరుస్తున్నారంటే ఆందోళనగా ఉండేది. పుస్తకాలు, యూనిఫాం వంటి ఖర్చుల కోసం దిగాలు పడేవాళ్లం. తప్పని పరిస్థితుల్లో చదువుల కోసం అప్పులు తెచ్చుకొనేవారం. అయితే గత మూడేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న అమ్మఒడి పథకం కింద ఏటా రూ.13వేలు నేరుగా మా ఖాతాలో జమ చేస్తున్నారు. దీని వల్ల పాఠశాలలు తెరిచినా భయం లేదు. పాఠశాల తెరిచిన రోజే విద్యా కానుక కూడా ఇచ్చారు.

– పద్మ, దేవనగర్, నంద్యాల

ప్రైవేటు బడికి పంపాలనే ఆలోచనే లేదు



నా కుమారుడిని ప్రైవేటు బడికి పంపాలని మొదట్లో అనుకునేవారం. అయితే జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దారు. ఇప్పుడు ప్రభుత్వ బడుల్లో అన్ని వసతులు కల్పించారు. అంతేగాకుండా చదువులకు ఇబ్బంది లేకుండా మా ఖాతాలో మూడు సంవత్సరాలుగా అమ్మఒడి పథకం కింద నా ఖాతాలో రూ.13 వేల చొప్పున జమ చేస్తున్నారు. నేడు నాల్గో విడత నిధులు మంజూరు చేయనుండటం సంతోషంగా ఉంది. – హేమలత, నంద్యాల

సచివాలయాలను సంప్రదించండి



అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో అమ్మ ఒడి నిధులు జమ అవుతాయి. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సచివాలయానికి వెళ్లి తమకు సంబంధించిన వివరాలు అందిస్తే అమ్మ ఒడి నిధులు మంజూరు అవుతాయి. జిల్లాలో నాల్గో విడత 1,67,084 మందికి రూ.217.20 కోట్లు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

–సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

నంద్యాల: జిల్లా సమగ్రాభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి బుగ్గన, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, తొగూర్ ఆర్థర్, కాటసాని రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి జిల్లా సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి పథం వైపు నడిపించాలని మంత్రి సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి, విద్యుత్, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణాలు, అలాగే మున్సిపల్ పరిధిలో పట్టణ అభివృద్ధి, సుందరీకరణ, పార్కులు, క్రీడా మైదానాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఆయా శాఖల అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేసి గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రైతులకు అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు అందజేయాలన్నారు. ఉపాధి హామీకి సంబంధించి లక్ష్యం మేరకు కూలీల సంఖ్యను పెంచి ఎప్పటికప్పుడు బిల్లులు అప్లోడ్ చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 11 రకాల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం లేకుండా, లంచాలకు తావు లేకుండా పారదర్శకంగా ప్రజలకు అందజేయాలని సూచించారు. జగనన్న లేఅవుట్లలో గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు విద్యుదీకరణ, తాగునీటి సరఫరా ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత ఇంజినీర్లను సస్పెండ్ చేసేందుకు వెనుకాడమని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేయాల్సిన ప్రాధాన్యత భవన నిర్మాణాల ప్రగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల భవన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై కఠిన చర్యలు తప్పవన్నారు. గతంలో పదేపదే పలు మార్లు చెప్పినప్పటికీ ప్రగతి లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణాలకు నిధుల కొరత లేదని, సిమెంట్ కూడా స్థానికంగా కొనుగోలు చేసి బిల్లులు సమర్పించాలని, గతంలో నిర్దేశించి ఉన్నామని అయినప్పటికీ నిర్మాణాల ప్రగతిలో ఇంజినీరింగ్ అధికారులు ఉదాసీనంగా వ్యవ హరించడం తగదన్నారు. రూఫ్ స్థాయిలో ఉన్న 87 ప్రాధాన్య భవనాలను స్లాబ్ స్థాయికి తీసుకురావాలన్నారు. అలాగే స్లాబ్ స్థాయిలో ఉన్న 114 భవనాలను ఫినిషింగ్ స్టేజీకి తీసుకొచ్చి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సంబంధించి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 414 గ్రామ సచివాలయాల భవనాలకు కాను 208 భవనాలు, 393 రైతు భరోసా కేంద్రాలకు గాను 108 భవనాలు, 267 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలకు గాను 45 భవన నిర్మాణాలు పూర్తయినట్లు కలెక్టర్‌కు పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మో హన్ నివేదించారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల విద్యుత్ ఏఈపై వేటు

- ప్రైవేటు వెంచర్లలో అనధికారికంగా లైన్ షిఫ్టింగ్ పనులు
- సంస్థకు చెందిన రూ.50లక్షల సామగ్రి వినియోగించినట్లు ఆరోపణలు

కర్నూలు(రాజ్‌విహార్): నంద్యాల జిల్లా (కర్నూలు సర్కిల్) కోవెలకుంట్ల మండలం విద్యుత్ ఆపరేషన్స్ ఏఈ బి.రామ సుబ్రహ్మణ్యంపై సస్పెన్షన్ వేటు పడింది. అధికార దుర్వినియోగం, ఇతర పలు ఆరోపణల కారణంగా ఆయనను సస్పెండ్ చేస్తూ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికారుల వివరాల మేరకు... కొంత కాలంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఈ రామ సుబ్రహ్మణ్యం కోవెలకుంట్ల పరిధిలోని ప్రైవేటు వెంచర్లు, ప్లాట్లలోని విద్యుత్ స్తంభాలు, తీగలు (లైన్ షిఫ్టింగ్)ను అనధికారికంగా మార్చారు. వాస్తవంగా లైన్ షిఫ్ట్‌కు ప్లాట్ లేదా వెంచర్ యజమాని దరఖాస్తు చేసుకోవాలి. ఆ లైన్‌ను బట్టి ఏఈ/ఏడీఈ/ఈఈ వెళ్లి పరిశీలించాక ఎస్టిమేషన్ (అంచనా) వేయాలి. ఆ అంచనా డబ్బును దరఖాస్తుదారులు చెల్లించాక పని మంజూరు చేయాలి. అయితే, ఇవేవి లేకుండానే ఆ ఏఈ పనులు పూర్తి చేసేశారు. అయితే వీటి కోసం సంస్థకు చెందిన సామగ్రితో పాటు రైతులు, ఇతర వర్గాల వినియోగదారులకు మంజూరు అయిన మెటీరియల్‌ను వాడారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఈ నెల 24వ తేదీన అక్కడికి వెళ్లి విచారణ జరపగా.. అనేక వాస్తవాలు వెలుగుచూశాయి. సుమారు 10 వెంచర్లు, ప్రైవేటు ప్లాట్లలో అనధికారికంగా పలు పనులు చేపట్టినట్లు తెలిసింది. ఇందుకు సంస్థకు చెందిన సుమారు రూ.50 లక్షల విలువైన స్తంభాలు, వైర్లు, ఇతర మెటీరియల్‌ను వినియోగించాడు. ప్రతిఫలంగా వచ్చిన సొమ్ముతో తన జేబులు నింపుకున్నట్లు విద్యుత్ శాఖలో చర్చ జరుగుతోంది. ఇవే కాక ఏఈ పనితీరుపై గతంలో అనేక ఫిర్యాదులు, ఆరోపణలొచ్చాయి. ఉన్నతాధికారులు హెచ్చరిస్తూ వస్తున్నా ఆయనలో మార్పురాకపోవడంతో ఏఈ రామ సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేస్తూ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ప్రైవేటు ప్లాట్లు, వెంచర్లలో అనధికారికంగా చేసిన లైన్ షిఫ్టింగ్ పనులకు వినియోగించిన విద్యుత్ స్తంభాలు, వైర్లు, ఇతర సామగ్రి ఎలా వచ్చింది? ఎవరు సరఫరా చేశారు? వాటి విలువ ఎంత? అతనితో పాటు ఇందులో ఎంత మంది పాత్ర ఉంది? ఇలా పలు కోణాల్లో విజిలెన్స్ విభాగం విచారణ చేస్తున్నట్లు సమాచారం.

వైఎస్ఆర్ పెన్షన్ కానుకకు రూ.124.96 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): జూలై నెల వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీకి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రభుత్వం మంగళవారం రూ.124,96,88,250 విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో 2,36,767 పింఛన్లకు రూ.65,83,29,750, నంద్యాల జిల్లాలో 2,14,259 పింఛన్లకు రూ.59,13,58,500 పంపిణీ చేయనున్నారు. 1వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీకి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. నిధులను ప్రభుత్వం 12 బ్యాంకులకు విడుదల చేసింది. వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి ఈ నెల చివరిలోపు డ్రా చేస్తారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన నిధులను సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య బ్యాంకర్లకు సూచించారు.

రాష్ట్రంలో క్రైంరేట్ తగ్గింది

శాంతిభద్రతలపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవంలేదు

- వారికి ఆధారాలతో సమాధానమిస్తాం
- మహిళా పోలీసులవల్ల గుర్తు తెలియని మృతదేహాలను గుర్తిస్తున్నాం
- దిశ యాప్ మహిళలకు రక్షణగా నిలుస్తోంది
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో గణనీయంగా తగ్గిన నేరాలు
- డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడి



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(టౌన్): ''రాష్ట్రంలో క్రైమ్ రేట్ తగ్గింది. 2014 నుంచి 2019 వరకు క్రైమ్ రేట్‌తో పోలిస్తే 2020 నుంచి 2023 మే వరకు రాష్ట్రంలో నేరాలు గణనీయంగా తగ్గాయి. క్రిమినల్స్‌ను కంట్రోల్ చేయడంతోనే క్రైమ్ కంట్రోల్‌లో ఉంది. హత్యలు, హత్యా యత్నాలు తగ్గాయి. శాంతిభద్రతల విషయంలో ఇతరులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. అలా చేసిన వారికి ఆధారాలతో సమాధానం ఇస్తాం''.. అని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టంచేశారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి జిల్లా స్థాయి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది నేరాలు గణనీయంగా తగ్గాయి. మహిళా పోలీసుల సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మహిళా పోలీసులవల్ల గుర్తుతెలియ ని మృతదేహాలను గుర్తిస్తున్నాం. బాల్య వివాహాలు తగ్గాయి. మహిళలు, చిన్న పిల్లలపై అత్యాచారాలు వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ కేసుల్లో ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో అనేక కేసుల్లో జీవిత ఖైదు, అంతకంటే ఎక్కువ శిక్షలు పడేలా పోలీసు శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తూ తక్కువ వ్యవధిలో కేసులను పరిష్కరిస్తోంది. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లు గుర్తించి వాటిని అరికడుతున్నాం. వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్, అవగాహన సదస్సులు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంటు పెంచుతూ రోడ్డు ప్రమాదాలను అరికడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర పోలీసులు, గ్రామీణ మహిళా పోలీసులు, వార్డు మహిళా పోలీసులు అందరూ కలిసికట్టుగా గ్రామాల్లో తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో గొడవలు, దొమ్మి కేసులు, కుటుంబ కలహాల కేసులు బాగా తగ్గాయి.

మహిళలకు రక్షణగా దిశ..

ఇక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన దిశా యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా మహిళల మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసి అవగాహన కల్పిస్తున్నాం. పోలీసులు సైతం మహిళల రక్షణకు నిరంతరం కృషిచేస్తున్నారు. మహిళలకు, మైనర్ బాలికలకు దిశ యాప్ రక్షణగా నిలుస్తోంది.

డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దుతాం

యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పోలీసుశాఖ తయారీదారులు, అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. సదరు వ్యక్తులపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నారు. మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి వారిపై పీడీ యాక్టులు పెడుతూ అవసరమైతే నగర బహిష్కరణకు గురిచేస్తున్నారు. ఈ సమావేశంలో కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ కె. రఘువీరారెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పాల్గొన్నారు.

భయం గుప్పిట్లో బలపాల తిప్ప

- రెండవరోజూ ఆవుల మందపై పెద్ద పులి దాడి
- లేగ దూడ మృత్యువాత
- భయాందోళనలో గ్రామస్తులు

కొత్తపల్లి: సంగమేశ్వరం సమీపంలోని బలపాల తిప్ప గ్రామంలో వరుసగా రెండో రోజు పెద్ద పులి ఆవుల మందపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి కోడెదూడను బలి తీసుకుని పులి సోమవారం రాత్రి కూడా మరో లేగదూడను చంపేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి ఆవుల మంద వద్ద కాపలాగా నారాయణ ఉన్నాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పెద్దపులి రాకను గమనించిన ఆవులు బెదిరి గట్టిగా ఆరిచాయి. అక్కడే ఉన్న నారాయణ నిద్రలేచి పెద్దపులిని గమనించి కేకలు వేశాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అరుపులు, కేకలు వేయడంతో పులి అక్కడి నుంచి వెళ్లిపోయింది. అప్పటికే పెద్దపులి దాడిలో లేగ దూడ చనిపోయింది. కాగా ఆవుల మంద నుంచి సుమారు 300 మీటర్ల దూరంలో పులి మాటు వేసి ఉండటంతో గ్రామస్తులు కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో మళ్లీ వేట కొనసాగించేందుకు కొండ గట్టుపైకి చేరుకోవడంతో ప్రజలు గుర్తించి భయాందోళన చెందారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎఫ్ఎస్ఓ నాగేశ్వరరావు తన బృందంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పెద్దపులి అప్పటికే అక్కడి నుంచి వెళ్లిపోయింది. అనంతరం ఎఫ్ఆర్ఓ పట్టాభి యాంటీ పోచింగ్ స్క్వాడ్ సుభాష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన లేగ దూడను పరిశీలించి పరిసర ప్రాంతంలో పెద్దపులి ముద్రలను గుర్తించి అక్కడే ఉన్న కెమెరా ట్రాప్‌లను పరిశీలించారు. గ్రామస్తులు సహకరిస్తే పెద్దపులి రాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనంతరం పశు వైద్యాధికారులు లేగ దూడ కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. సంఘటన స్థలంలో కెమెరా ట్రాప్‌లు ఉంచినా కూడా ఏదానిలో పెద్దపులి ఆచూకీ కనపడక పోవడంతో గ్రామస్తులు మరింత భయాందోళనకు గురవుతున్నారు.

మూగవేదన


లేగ దూడ కళేబరం వద్ద తల్లి ఆవు

తన కళ్ల ముందు గెంతులు వేస్తూ అటు ఇటు తిరిగిన లేగ దూడ విగత జీవిగా కనిపించడంతో తల్లి ఆవు తల్లడిల్లిపోయింది. పులి పంజాకు ప్రాణాలు విడిచిన దూడను తల్లి ఆవు లేపే ప్రయత్నం అక్కడి వారిని కన్నీరుపెట్టించింది. సృష్టిలో తల్లి ప్రేమకు మించినది ఏదీ లేదని, అది మనుషుల్లోనైనా, జంతువుల్లోనైనా ఒకటేనని ఈ ఘటన నిరూపించింది.



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మహిళా పోలీసు కె. జ్యోతి (ఆదోని వన్‌టౌన్)

ఉత్తమ సేవలకు ప్రశంస

- మహిళా పోలీసుల సేవలను కొనియాడిన డీజీపీ
- ప్రోత్సాహక నగదు అందజేత

కర్నూలు (టౌన్): ఉమ్మడి జిల్లాలో గ్రామ, వార్డు మహిళా పోలీసుల సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పోలీసు శాఖకు విశేష సేవలు అందించిన మహిళా పోలీసులను డీజీపీ ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు స్థాయిల్లో మహిళా పోలీసులు పనిచేయడం ద్వారా ఎన్నో మిస్సింగ్ కేసులు ఛేదించామని, గుర్తు తెలియని మృతదేహాలను గుర్తించగలిగామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు తగ్గడంలో మహిళా పోలీసుల పాత్ర ఉందన్నారు. ఈ సమావేశంలో కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్. సెంథిల్ కుమార్, కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ కె. రఘువీరారెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు.


ఎం మధులత (నంద్యాల తాలుకా పీఎస్)


షేక్ మైమున్నీసాబేగం (ఆత్మకూరు పీఎస్)


ఎంవీ నారాయణమ్మ (నంద్యాల టు టౌన్ పీఎస్)


వైవీ లక్ష్మీదేవి (బేతంచెర్ల పీఎస్)


యశోద లక్ష్మీ (డోన్ పీఎస్)


భారతి (నంద్యాల త్రీ టౌన్ పీఎస్)

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

బనగానపల్లెరూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామతీర్థం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాజారత్నం, రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు అల్వకొండ బాబు (19) ఇటీవల ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేశాడు. కాగా పై చదువుల నిమిత్తం ఏ కోర్సులో చేరాలనే విషయంలో ఆందోళన చెందాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

బైక్ మెకానిజంలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు బైక్ మెకానిజంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల శిక్షణ కార్యక్రమం జూలై 13 నుంచి మొదలవుతుందన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారై.. చదవడం, రాయడం వచ్చిన వారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారే 90007 10508ను సంప్రదించాలన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


మృతుడు రాఘవేంద్ర

జూపాడుబంగ్లా: మండ్లెం గ్రామానికి చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వడ్డె శ్రీనివాసులు, రామలక్ష్మమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. కుమార్తె వివాహం కాగా కుమారుడు రాఘవేంద్ర (19) ఆటో నడుపుతూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. ఈనెల 24వ తేదీ ఉదయం ఆటోతో బయటకు వెళ్లిన యువకుడు రాత్రయినా తిరిగి రాలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఈనెల 25న జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారు. కాగా ఐదు రోజుల తర్వాత మంగళవారం ఉదయం గ్రామ శివారులోని ఓ రైతు పొలంలో చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఆత్మహత్య చేసుకున్న ప్రాంతానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఆటో ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నందికొట్కూరు ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

